క్లుప్తంగా

కాంగ్రెస్ పట్టణ అధ్యక్ష స్థానానికి తీవ్ర పోటీ



నామినేషన్ దాఖలు చేస్తున్న చొప్పదండి ప్రకాశ్

సిరిసిల్ల కల్చరల్: పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష స్థానాన్ని కైవసం చేసుకునేందుకు భారీగా పోటీ పడుతున్నారు. విద్యానగర్‌లోని డీసీసీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఈ మేరకు నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. పరిశీలకులు ఖాజా ఫకృద్దీన్, చైతన్య కృష్ణారెడ్డి ఇన్‌చార్జి సమక్షంలో నామినేషన్లు స్వీకరించారు. పోటీపడుతున్న వారిలో చొప్పదండి ప్రకాశ్, ఆడెపు ప్రభాకర్, ఆడెపు చంద్రకళ, సూర దేవరాజ్, ఎల్‌పీ లక్ష్మీనారాయణ, గోలి వెంకటరమణ, బీమవరం శ్రీనివాస్, కోడం అమర్, రాపెల్లి కల్యాణ్, గోనె ఎల్లప్ప, కల్లూరి చందన, ప్రశాంత్, పిస్క మధు, అన్నల్‌దాస్ మధు తదితరులు తమ నామినేషన్ పత్రాలు ఇచ్చారు

ఘనంగా రథోత్సవం



కోనరావుపేట: మండలంనిలోని కనగర్తిలో శ్రీవేణుగోపాల స్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఏటా రథోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

హనుమాన్ దీక్షాపరుల పూజలు

ముస్తాబాద్: ఆపరేషన్ సిందూర్‌లో విజయం సాధించిన భారత్ ప్రపంచంలో మేటి దేశంగా ఎదగాలని కోరుతూ మండలంలోని బందనకల్ శ్రీవాసుదేవ ఆశ్రమంలో హనుమాన్ మాలధారులు సోమవారం పూజలు చేశారు. రేపాక రామశర్మ, రాజేందర్‌శర్మ ఆధ్వర్యంలో సుందరకాండ హోమం నిర్వహించారు. హనుమాన్ భక్త మండలి సభ్యులు వెంకట్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి,బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

చెట్లు తొలగించిన వ్యక్తికి జరిమానా

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో ఆదివారం చెట్లు తొలగించిన వ్యక్తికి పంచాయతీ అధికారులు సోమవారం రూ. 3వేల జరిమానా విధించారు. అనుమతులు లేకుండా చెట్లు తొలగిస్తే చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు చేయడమే కాకుండా జరిమానాలు విధిస్తామని ఈవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. తన ఇంటి ముందు ఉన్న చెట్లను అక్రమంగా తొలగించిన సంతోష్‌కు జరిమానా విధించినట్లు తెలిపారు.

కేటీఆర్ సేన అంటే భయమెందుకు ?



గ్రామ కమిటీని నియమిస్తున్న భాస్కర్ గౌడ్

తంగళ్లపల్లి: కాంగ్రెస్ నాయకులు కేటీఆర్ సేన పేరు వింటేనే భయపడుతున్నారని కేటీఆర్ సేన మండల అధ్యక్షుడు నందగిరి భాస్కర్ గౌడ్ ఎద్దేవా చేశారు. సోమవారం మండలకేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కేకే సేన పేరుతో మీరు చేసిక అక్రమాలు తెలుసని కాంగ్రెస్ నాయకులను హెచ్చరించారు. ప్రజలకు ఎవరి మద్దతు ఉందో ముందు తెలుసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలుచేయడంలో విఫలమైందన్నారు. అనంతరం కేటీఆర్ సేన అంకుషాపూర్ గ్రామ కమిటీని నియమించారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా బాలసాని వెంకటేశ్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా బోనుగని మహిపాల్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా చిట్యాల రాజశేఖర్, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా బట్కు అజయ్ యాదవ్, కార్యదర్శిగా మిడిదొడ్డి శ్రీకాంత్, కోశాధికారిగా రేగల సురేందర్ లకు నియామక పత్రాలను అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు, కేటీఆర్ సేన నాయకులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



ఇల్లంతకుంట: మండలంలోని తిప్పాపూర్ శివారులో బిక్క వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై కే శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. తిప్పాపూర్ గ్రామానికి చెందిన బెజ్జంకి తిరుపతి ట్రాక్టర్ వదిలిపెట్టి పారిపోయాడని ఎస్సై పేర్కొన్నారు.

ప్రత్యామ్నాయం వైపు అడుగులు

- సాడు భూముల్లో అధునాతన సేద్యం
- గ్రామాల్లో నూతన ఒరవడి సృష్టిస్తున్న రైతులు
- డిమాండ్ ఉన్న పంటలపై దృష్టి
- తక్కువ భూమిలో అధిక దిగుబడి



ఈచిత్రంలో కనిపిస్తున్న రైతుపేరు వంగల నర్సింహా రెడ్డి. మండలంలోని రాచర్ల గొల్లపల్లికి చెందిన నర్సింహారెడ్డి సౌడు భూమిలో ఆధునాతన సేద్యానికి శ్రీకారం చుట్టాడు. ఆర్గానిక్ పద్ధతిలో చిరుధాన్యాలు సాగుచేశాడు. 30ఎకరాల్లో తీరొక్క పంటలు వేసి ఏటా సుమారు రూ.12లక్షల దాకా ఆదాయం సమకూరుతోంది. ఇందులో రూ.4లక్షలు ఖర్చులు పోగా రూ.8లక్షలు మిగులుతున్నాయి. డ్రైసిడింగ్ యంత్రాన్ని వాడి టైం, డబ్బును ఆదా చేస్తున్నాడు.



రాజన్నపేటలో పందిరిపై పంటల సాగు



ఈచిత్రంలో కనిపిస్తున్న రైతుపేరు సంకూరి శంకర్. రాజన్నపేటకు చెందిన శంకర్ బతుకుదెరువు కోసం 19ఏళ్లు గల్ఫ్‌కు వెళ్లి 2013లో ఇంటికి వచ్చాడు. తనకున్న ఎకరం భూమిలో మొదట వరి సాగుచేశాడు. బోరులో సరిగా నీరు లేకపోవడంతో కూరగాయలు పండించాలని భావించాడు. అందులో భాగంగా పందిరి సాగుకు 2016లో భార్య పేరుపై మహిళా సంఘం ద్వారా రూ.లక్ష రుణం తీసుకున్నాడు. ఆ సొమ్ముతో 20గుంటల భూమిలో పందిరి వేయించాడు. తక్కువ నీటిని వినియోగించుకునేలా డ్రిప్ ఏర్పాటు చేశాడు. కేవలం రూ.5వేలతో కూరగాయల సాగుకు పూనుకున్నాడు. ప్రస్తుతం 20గుంటల భూమిలో నెలకు రూ.30వేలు సంపాదిస్తున్నట్లు రజిత–శంకర్ దంపతులు చెబుతున్నారు.

ఎల్లారెడ్డిపేట: వినూత్న ఆలోచనా విధానం.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గ్రామాల్లో రైతులు ప్రత్యామ్నాయ పంటలవైపు అడుగులు వేస్తున్నారు. సాగుకు యోగ్యంకాని సౌడు భూముల్లో సిరులు పండిస్తున్నారు. ఏటా తీరొక్క పంటలు వేస్తూ అధునాతన పద్ధతులు పాటిస్తూ అద్భుతాలు సృష్టిస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు ప్రాంతాలకు చెందిన 25 మంది రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేస్తూ..అధిక దిగుబడులు సాధిస్తుండగా వారిని కలెక్టర్, ప్రజాప్రతినిధులు గుర్తించి ఇటీవల వారిని ప్రశంసాపత్రాలతో సత్కరించారు. నూతన సాగు పద్ధతులను అవలంబిస్తూ మిగతా రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. రాజన్నపేటకు చెందిన రైతు సుంకూరి శంకర్ పందిరి సాగు చేపట్టి 20గుంటల భూమిలో కూరగాయలు సాగుచేసి నెలకు రూ.30వేల ఆదాయం పొందుతున్నాడు. రాచర్ల గొల్లపల్లికి చెందిన మహమ్మద్ ఇబ్రహీం అనే రైతు నాలుగెకరాల్లో వినూత్న రీతిలో వ్యవసాయం చేస్తూ, కూలీల కొరతను అధిగమించేందుకు డ్రమ్‌సీడర్, వెదజల్లు ప్రక్రియ ద్వారా వరి పంటను పండించడమే కాకుండా వానాకాలంలో విత్తనోత్పత్తి ద్వారా సుమారు 2లక్షల పైచిలుకు అదనపు ఆదాయం పొందుతున్నాడు.

ఆరుతడితో అధిక దిగుబడి..

జిల్లాలో రైతులు ఆరుతడి పంటలతో అధిక దిగుబడులు సాధిస్తున్నారు. పందిరిపై బీర, కాకర, సొరకాయ, అలిచెంత, చిక్కుడు, అంతర్ పంటగా టమాట, బెండకాయ, గోరుచిక్కుడు, కొత్తిమీర, ఉల్లి పంటలను సాగుచేస్తున్నారు. సిరిసిల్లకు చెందిన రైతు రంగారెడ్డి పూలపంటలు, గొల్లపల్లిలో నర్సింహారెడ్డి చిరుధాన్యాలు, మరికొందరు రైతులు డ్రమ్‌సీడర్, విత్తనాలు వెదజల్లే పద్ధతిలో తక్కువ భూమిలో పంటలనుసాగుచేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు.

డిమాండ్ ఉన్న పంటల వైపే..

మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలపై రైతులు మొగ్గు చూపుతున్నారు. నూతన సాగు (ఇన్నోవెటివ్) పద్ధతులు పాటిస్తూ..పంటలు పండిస్తున్నారు. సేద్యం తీరును మార్చి నూతన ఒరవడిని సృష్టిస్తున్న అభ్యుదయ రైతులను కలెక్టర్ స్థాయి అధికారులు గుర్తించి వారిని ప్రోత్సహించే విధంగా ప్రసంశపత్రాలు అందించి అభినందించారు. ఇకపై మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలనే సాగుచేసేలా మిగతా వారికి పల్లెల్లో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

విభిన్న పద్ధతుల్లో వ్యవసాయం

ప్రత్యామ్నాయ సాగు పద్ధతులు అవలంబిస్తూ రైతులు ముందుకెళ్తున్నారు. కొత్త విధానాలు నేర్చుకునేందుకు ఎప్పటికప్పుడు అధికారులను సంప్రదిస్తున్నారు. పంటల మార్పిడి నూతన యంత్రాల వాడకం, అర్గానిక్ ఫామింగ్ వంటి పద్ధతుల్లో వ్యవసాయం చేస్తూ..చిరుధాన్యాలు, ఆరుతడి పంటలు పండిస్తున్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేస్తున్నారు.

– రాజశేఖర్, వ్యవసాయాధికారి, ఎల్లారెడ్డిపేట



గంభీరావుపేట: గంభీరావుపేట మండలకేంద్రం నుంచి నర్మాల గ్రామానికి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన చెత్తాచెదారం పేరుకుపోతోంది. చుట్టుపక్కన కాలనీ ప్రజలు చెత్తాచెదారం, పనికిరాని వస్తువులను రోడ్డుకు ఇరువైపులా పారబోస్తున్నారు. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గాలికి చెత్తాచెదారం రోడ్డుపైకి రావడం, వాహనదారుల కళ్లలో పడడంతో ఇబ్బందులు పడుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
లక్ష్మణ్, పంచాయతీ ఈవో, గంభీరావుపేట 9849597070

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

సేంద్రియ ఎరువులనే చల్లాలి



మాట్లాడుతున్న డాక్టర్ కనకదుర్గ

ముస్తాబాద్: రైతులు తమ పంటపొలాల్లో అధిక యూరియా చల్లవద్దని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కనకదుర్గ అన్నారు. ముస్తాబాద్ రైతువేదికలో «రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు–అన్నదాతల అవగాహన కార్యక్రమం» సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కనకదుర్గ మాట్లాడుతూ పంటపొలాల్లో సేంద్రియ ఎరువుల వినియోగించి, భూసారం కాపాడుకోవాలన్నారు. రైతులు తాము కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, పెస్టిసైడ్స్‌పై రశీదులు తప్పకుండా తీసుకోవాలన్నారు. సైంటిస్టు డాక్టర్ శ్రీనివాస్, ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి, వైస్‌చైర్మన్ వెల్ముల రాంరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, వీటీడీఏ డైరెక్టర్ కొండం రాజిరెడ్డి, వ్యవసాయాధికారి దుర్గరాజు, డైరెక్టర్లు వెంకటరమణారెడ్డి, కొంరయ్య, ఏఈవోలు రేవతి, అనూష, సౌమ్య, రైతులు పాల్గొన్నారు.

'దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి'



బోయినపల్లిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు



ఇల్లంతకుంట: మాట్లాడుతున్న సీపీఐ కార్యకర్తలు

బోయినపల్లి: కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే ప్రభుత్వాలు నిలిపివేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఈనెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజమవంతం చేయాలని కోరుతూ రూపొందించిన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూసమ్మెకు కార్మికులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. మండల కన్వీనర్ గురజాల శ్రీధర్, మండల పవర్‌లూం సంక్షేమ సంఘం నాయకులు దూస జనార్దన్, శ్రీపతి దేవయ్య, తడుక రామాంజనేయులు, శ్రీపతి రవీందర్, సిరిపురం ఉపేందర్, దూస మల్లేశం, దేవసాని శ్రీనివాస్, వేముల సదానందం తదితరులు ఉన్నారు.

కోనరావుపేట: ఈనెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి కోరారు. సమ్మె పోస్టర్‌ను హమాలీ సంఘ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: ఈనెల 20న జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో వివిధ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు పాల్గొనాలని జిల్లా సీపీఐ నాయకులు మంద సుదర్శన్ అన్నారు. సోమవారం మండలంలోని అనంతారం, వెల్జిపూర్, రహీంఖాన్‌పేట, ఓబు లాపురం, గ్రామాల్లో సీపీఐ పార్టీ గ్రామసభల్లో ఆయన పాల్గొన్నారు. సమావేశంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు మీసం లక్ష్మణ్, మంద శ్రీనివాస్, ఎం శ్రీనివాస్ కొమురయ్య, బ్రహ్మం, పిల్లి కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం అడ్డగింత



అక్రమ నిర్మాణ పనులు నిలిపివేయించిన అధికారులు

చందుర్తి: మండలంలోని మూడపల్లిలో అక్రమ నిర్మాణాన్ని రెవెన్యూ అధికారులు సోమవారం అడ్డుకున్నారు. ఓ రైతు ఎల్లంపల్లి కాలువ భూమిని, ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం చేపట్టాడన్న సమాచారంతో పనులను ఆర్‌ఐ మహేందర్ పరిశీలించారు. సర్వే చేసే వరకు పనులు నిలిపి వేయాలని సంబంధింత రైతుకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. అంతేకాకుండా నెల రోజుల క్రితం మిషన్ భగీరథ పైపులపై బోరు వేయించి పైపులు పగిలేందుకు బాధ్యుడైనా చర్యలు తీసుకోకపోవడంతోనే తిరిగి ప్రభుత్వ భూమిని చదును చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టుతున్నాడని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. గ్రామానికి చెందిన ఓ రాజకీయ నాయకుడి అండదండలతోనే ఇలా చేస్తున్నాడనే ప్రచారం ఉంది.

కార్మికులకు ఒకపూట సెలవు ఇవ్వాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్మికులు

ముస్తాబాద్: పంచాయతీ కార్మికులకు వేసవిలో ఒకపూట సెలవు ఇవ్వాలని కోరుతూ ఎంపీడీవో బీరయ్యకు సీఐటీయూ మండల అధ్యక్షుడు లోకిని శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వేసవిలో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురవుతూ రోగాల బారిన పడుతున్నారన్నారు. ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు పనిచేసేలా చూడాలన్నారు. కార్మికులకు ఒక పూట సెలవు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పిస్తూ రూ.24వేల వేతనం ఇవ్వాలని కోరారు.కార్యక్రమంలో పి.బాబు, లచ్చిగారి రమేశ్, పోచయ్య, శ్రీను, సుధాకర్, బాలెల్లు, బాబాయి, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా గరుడ సేవోత్సవం



గరుడసేవపై వేణుగోపాలస్వామి

గంభీరావుపేట: మండలంలోని కొత్తపల్లిలో శ్రీ వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి గరుడ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. గరుడవాహన సేవపై స్వామి వారు పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. మంగళవారం స్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.

ఆర్‌జీరావు ట్రస్టుకు ఎంపిక

గంభీరావుపేట: మండలంలోని కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన మణికర్ణ ఆర్‌జీరావు ఎడ్యుకేషనల్ ట్రస్టు ఎంట్రన్స్ టెస్ట్‌లో రాష్ట్రస్థాయి 66వ ర్యాంకు సాధించాడు. ఈనెల 14న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు మణికర్ణ హాజరుకానున్నాడు. సోమవారం ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారావు, ఉపాధ్యాయుడు పోతుల నారయణలు విద్యార్థిని అభినందించారు.

నోటీసులు అందజేత



ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని వంతడుపుల బైపాస్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇంటి యజమానులకు సోమవారం ఇల్లంతకుంట గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్ వరుణ్‌కుమార్ నోటీసులు అందించారు. వివేకానంద చౌరస్తా నుంచి ఎస్సీకాలనీ వరకు రోడ్డు కిరువైపులా సీసీరోడ్డు పనులు చేపట్టారు. డివైడర్ నుంచి 25 ఫీట్ల వరకు సెట్ బ్యాక్ కావాలని సూచిస్తూ 31 మంది ఇళ్ల యజమానులకు కార్యదర్శి నోటీసులు అందజేశారు. ఆయనవెంట జీపీసిబ్బంది నర్సయ్య, తదితరులు ఉన్నారు.

చంపుతామని బెదిరించిన వ్యక్తులకు రెండేళ్ల జైలు

సిరిసిల్లకల్చరల్: వ్యక్తి ఇంటిలోకి అక్రమంగా చొరబడి చంపుతామని బెదిరించిన ఐదుగురు వ్యక్తులకు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ సోమవారం తీర్పునిచ్చారు. పట్టణ సీఐ కృష్ణ తెలిపిన వివరాలు. చంద్రంపేటకు చెందిన అరుణ ఇంటి చుట్టూ ఖాళీ స్థలాన్ని కవర్ చేస్తూ పంచాయతీ అనుమతి మేరకు ప్రహరీ నిర్మించారు. తన భూమిలో ప్రహరీ నిర్మిస్తున్నారంటూ ఎర్ర మల్లేశం, ఎర్ర రాజవ్వ, ఎర్ర సుజాత, ఎడవల్లి మలవ్వ, జింక దేవవ్వతో కలిసి 2018 మార్చి 28న అరుణ ఇంటి ప్రహరీని కూల్చివేశారు. గోడ కూల్చిన విషయాన్ని కర్రె పోచవ్వ అనే మహిళ అరుణకు తెలియజేసింది. ఈ ఇద్దరిపై సదరు ఐదుగురు గడ్డపారలతో దాడి చేసేందుకు ప్రయత్నించారు. జరిగిన సంఘటనపై పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఎస్సై లియాఖత్ అలీ చార్జిషీట్ దాఖలు చేశాడు. పీపీ చెలుమల సందీప్ కేసు వాదించారు. 11 మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితులు ఐదుగురికి రెండేళ్ల చొప్పున జైలుతోపాటు రూ.6వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

పూడికతీత పనులు చేపడుతాం

ఎల్లారెడ్డిపేట: పూడికతీత పనులను వెంటనే పూర్తిచేసి రైతులకు ఇబ్బందులు లేకుండా సాగునీటిని పంట పొలాలకు అందిస్తామని నీటిపారుదల శాఖ ఈఈ అమరేందర్‌రెడ్డి అన్నారు. «సాక్షి» దినపత్రికలో «కాలువ పారదు.. చెరువు నిండదు» అనే శీర్షికన వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. జిల్లాలో సాగునీటి కాలువల్లో పేరుకుపోయిన పూడిక, ముళ్లపొదలు, చెట్లను తొలగించకపోవడంతో సాగునీటి కాలువల వెంట వస్తున్న నీరు మానేరువాగులో కలుస్తున్నాయి. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మండలంలోని కోరుట్లపేట పరిధి పారెటివాగు నుంచి టీకులపల్లి చెరువు వరకు, రాచర్లబొప్పాపూర్ గ్రామ పరిధిలోని గంగమ్మ గుడి టీకులపల్లి చెరువు వరకు కాలువల పూడికతీత పనులను ఉపాధిహామీ పథకంలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. వానాకాలం సీజన్ వరకు అన్ని చెరువుల పరిధిలోని కాలువల్లో పూడికతీత పనులు చేపడుతామన్నారు.

సాక్షి స్పందన

మొక్కలను కాపాడుతాం



ట్యాంకర్‌తో మొక్కలకు నీరు పడుతున్న జీపీ సిబ్బంది

ముస్తాబాద్: మండలంలోని మొర్రాయిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో హరితహారంలో నాటిన మొక్కలను బతికిస్తామని ఎంపీడీవో బీరయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాక్షిలో «ఎండుతున్న మొక్కలు» శీర్షికన ఈనెల 10న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ముస్తాబాద్–నామాపూర్ ప్రధాన రహదారిపై ఎండిపోయిన మొక్కలతోపాటు మిగతా మొక్కలకు పంచాయతీ ట్యాంకర్‌తో నీరు పట్టినట్లు తెలిపారు. నామాపూర్–రాంరెడ్డిపల్లె గ్రామాల మధ్య మానేరు కెనాల్‌పై ప్రమాదకరంగా ఉన్న వంతెనపై ఈనెల 11న సాక్షిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ రాజ్ డీఈఈ సుదర్శన్‌రెడ్డి స్పందించారు. మానేరు కెనాల్‌పై వంతెనకు సమాంతరంగా ఉన్న రక్షణ గోడలతో ప్రమాదాలు సంభవించకుండా, పనులు చేపడుతామని డీఈఈ పేర్కొన్నారు.

దుకాణాలకు చేరిన రేషన్ బియ్యం



పంపిణీకి సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యం

గంభీరావుపేట: పేదల బియ్యం రేషన్ దుకాణాలకు చేరాయి. నెల ప్రారంభమై పది రోజులు గడిచినా బియ్యం పంపిణీ జరగడం లేదని ఈనెల 11న సాక్షిలో «రేషన్.. ఆలస్యం» అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం గంభీరావుపేట మండలకేంద్రంలోని రేషన్ దుకాణాలకు రేషన్ బియ్యం పంపించారు. మంగళవారం నుంచి బియ్యం పంపిణీ ప్రక్రియ ప్రారంభిస్తామని డీలర్లు తెలిపారు.

జయవరంలో బడిబాట

వేములవాడరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని వేములవాడ రూరల్ ఎంఈవో కిషన్ అన్నారు. జయవరంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు నూతన అడ్మిషన్‌లు చేశారు. మూడు రోజుల నుంచి రాజానగర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు లింగంపల్లి రాజు, వకుళలు జయవరం గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు సమావేశం నిర్వహించారు.

ఘనంగా వైశాఖ పూజ



ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని పురాతన శివాలయంలో సోమవారం వైశాఖ పూజలు నిర్వహించారు. పురోహితులు రాచర్ల దయానందశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు మంగళ హారతులతో తరలివచ్చారు.


లైట్లను ఏర్పాటు చేస్తాం

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని శివారు ప్రాంతాల్లో విద్యుత్ లైట్లు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే లైట్లను ఏర్పాటు చేస్తామని ఎంపీడీవో సత్తయ్య అన్నారు. «సాక్షి»లో «శివారు ప్రాంతాలు చీకట్లో మగ్గుతున్నాయి అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. కొత్త వైరింగ్ వేసి విద్యుత్ లైట్లు వెలిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ముగిసిన 'ఉపాధి' గ్రామసభలు

వీర్నపల్లి: మండలంలోని అడవిపదిర, బంజేరు, శాంతినగర్, వన్‌పల్లి, మద్దిమల్ల, లాల్‌సింగ్ తండా, మద్దిమల్ల తండా, గర్జనపల్లి గ్రామాల్లో ఉపాధిహామీ గ్రామసభలు సోమవారంతో ముగిశాయి, నాలుగో విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అబ్దుల్ వాజిద్ తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి



శంకరయ్య (ఫైల్)

వేములవాడరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి (50) చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. వేములవాడ మున్సిపల్ పరిధి కోనాయపల్లి వద్ద ఆదివారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొనగా ఇద్దరికి గాయాలయ్యాయి. వేములవాడ రూరల్ మండలం నాగాయపల్లికి చెందిన శంకరయ్య కరీంనగర్‌లో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్యబాబాయ్,కూతురు ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

ముస్తాబాద్: మండల కేంద్రంలో సోమవారం రాత్రి పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ప్రొబేషనరీ ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేశారు. ప్రొబేషనరీ ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపవద్దని సూచించారు.

జాగ్రత్తగా ఉండాలి

ఎల్లారెడ్డిపేట: మండలంలో లవ్ జిహాద్ పేరిట హిందూ యువతులను, వివాహితలను మాయ మాటలతో లొంగదీసుకొని హిందువుల జీవితాలను నాశనం చేస్తున్నారని బీజేపీ మాజీ మండల అధ్యక్షులు పొన్నాల తిరుపతిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడారు. కొన్ని గ్రామాల్లో ముస్లిం యువకులు హిందు యువతులు, వివాహితలను నమ్మించి పెళ్లిపేరుతో వారి జీవితాలను చెడగొడుతున్నారని, వారిపట్ల జాగ్రత్తగాఉండాలన్నారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

ఇల్లంతకుంట: లారీల కొరతతో కొనుగోలు కేంద్రాలనుంచి ధాన్యం తరలింపు ఆలస్యమవుతుందని బీజేపీ మానకొండూర్ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ బత్తిని స్వామి అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షాలు పడితే ధాన్యం తడిసే అవకాశం ఉన్నందున, వెంటనే ట్రాక్టర్ల ద్వారా మిల్లులకు ధాన్యం తరలించాలని కోరారు.